క్లుప్తంగా

అంబేడ్కర్ భవన నిర్మాణానికి చర్యలు తీసుకోండి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని లౌకిక రాజ్య పరిరక్షణ సమితి (ఎల్‌ఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షులు మందల రమేష్ కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఆర్డీఓను వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ భవన నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎకరం స్థలం కేటాయించిదన్నారు. నియోజకవర్గంలో దళితులకు స్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని, కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మహాలింగ, రవికుమార్, కళ్యాణ్, రామాంజి, సాకే వన్నూరుస్వా మి, మనోహర్, బి.వన్నూరుస్వామి, రాజు పాల్గొన్నారు.

చెట్టు.. నరికితే ఒట్టు

- విట్లంపల్లిలో గ్రామస్తుల కట్టుబాటు



విట్లంపల్లిలో చాటింపు వేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: మండలం విట్లంపల్లిలో పచ్చని చెట్లను నరకూడదన్న కట్టుబాటు గ్రామస్తులు నేటికీ ఆచరిస్తున్నారు. మొహర్రం (పీర్ల) పండుగను పురస్కరించుకొని భక్తులు పచ్చని చెట్లు కొట్టి, మొద్దులు అగ్ని గుండంలోకి వేసి, మొక్కులు తీర్చుకుంటారు. అయితే ఇక్కడ విట్లంపల్లిలో ఎవరైనా పచ్చని చెట్లు నరికితే జరిమానా విధిస్తామని గ్రామస్తులంతా తీర్మానం చేశారు. కొన్నేళ్లుగా ఇదే కట్టుబాటును పాటిస్తున్నారు. నాటి తీర్మానానికి కట్టుబడి గ్రామస్తులంతా ఏకతాటిపై పచ్చని చెట్లు కొట్టి గుండంలోకి వేయరాదని, కేవలం ఎండిన చెట్లు, మొద్దులు మాత్రమే వేయాలని చాటింపు వేశారు.

మేజర్ పంచాయతీ కార్యదర్శిగా శిక్షణ కలెక్టర్



ట్రైనీకలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

కణేకల్లు: శిక్షణ కలెక్టర్ సచిన్ రహార్ 14 రోజుల శిక్షణలో భాగంగా కణేకల్లు మేజర్ పంచాయతీ కార్యాలయ కార్యదర్శిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 21 వరకు ఆయన కార్యదర్శిగా కొనసాగనున్నారు. ట్రైనీ కలెక్టర్‌కు తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ విజయసింహారెడ్డి, వీఆర్వో పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

10న పేరెంట్స్ సమావేశం



మాట్లాడుతున్న ఎంఈఓ తిమ్మప్ప

వజ్రకరూరు: ఈనెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఉంటుందని ఎంఈఓ తిమ్మప్ప తెలిపారు. సోమవారం మండలంలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ఈసమావేశంలో ప్రధానంగా విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులకు వివరించడం, విద్యాభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఎంఈఓ ఎర్రిస్వామి, హెచ్ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జరుట్ల రామలింగేశ్వరుడికి అభిషేకాలు




రామలింగేశ్వరస్వామి, భోగేశ్వరస్వామి

వజ్రకరూరు: మండలంలోని జరుట్ల రాంపురం రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయమే రుద్రాభిషేకం, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. వజ్రకరూరులోని నగరేశ్వరస్వామి, భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లోనూ పూజలు చేశారు.

‘వందనం’.. అంతా అయోమయం

- ‘తల్లికి వందనం’ రెండో జాబితా గందరగోళం
- సచివాలయాల చుట్టూ తిరుగుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు





ఉరవకొండ సచివాలయం వద్ద రెండో జాబితా వచ్చిందో లేదో నోటీస్ బోర్డులో చూస్తున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇటీవల అమలు చేసిన ‘తల్లికి వందనం’ రెండో జాబితా అయోమయంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో జాబితా జూన్ 30న విడుదల చేసి, జూలై 5న లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేస్తామని చెప్పినా.. నేటికీ ఇంకా జాబితా విడుదల చేయకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 777 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈఏడాది 1,50,889 విద్యార్థులు చదువుతున్నారు. దీనికి తోడు మరో 300 వరకు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 38వేల వరకు విద్యార్థులు దాకా ఉంటారు. జూనియర్ కళాశాలలు 15 వరకు ఉన్నాయి. ఇందులో 1400 మంది విద్యార్థులు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మూడు నియోజకవర్గాలోని 87,538 మంది తల్లులకు రూ.113.79 కోట్లు ఎలాంటి ఆంక్షలు లేకుండా అమ్మఒడి అందించారు. ప్రస్తుతం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెబుతూ సవాలక్ష కొర్రీలతో తల్లికి వందనం అందకుండా చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలా కోత పెట్టారు..

ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో మొదటి జాబితాలో సుమారు 20 శాతం మందికి డబ్బులు పడలేదు. ఇన్‌ఎలిజిబుల్ లిస్టులో పేర్లు చూసుకున్న వారికి ‘నాలుగు చక్రాల వాహనం ఉందని, మూడెకరాల పొలం కంటే ఎక్కువ ఉందని, నెలకు 300 యూనిట్ల పరిధి దాటిందని, ప్రభుత్వ ఉద్యోగం ఉందని, ఇన్‌కం టాక్స్ కడుతున్నారని తదితర కారణాలు చూపించి కోత పెట్టారు.

సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు:

చాలా మంది పిల్లల తల్లిదండ్రులు గత ప్రభుత్వంలో అందరికీ ‘అమ్మ ఒడి’ వర్తించిందని సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే సచివాలయ సిబ్బంది మాత్రం ఇన్‌ఎలిజిబుల్ జాబితాలో ఏ కారణం సూచించారో అవి నిజం కాదని పత్రాలు తెచ్చుకుంటే అవి గ్రీవెన్స్‌లో పెడుతామని చెబుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్‌టీఓ కార్యాలయానికి వెళ్లి నాలుగు చక్రాల వాహనం లేదని, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ పేరుతో ఒక్క సెంటు భూమి లేదని, విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లి సరాసరి వార్షిక విద్యుత్ వినియోగం 300 యూనిట్లు లేదని, ఆడిటర్ నుంచి ఇన్‌కమ్ ట్యాక్స్ కట్టడం లేదని పత్రాలు, ప్రభుత్వ ఉద్యోగం లేదని సెల్ఫ్ డిక్లరేషన్‌లు తీసుకొరావాలంటూ చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు.

పదెకరాల భూమి చూపించారు..



మగ్గంపై ఆధార పడి జీవిస్తున్న తనకు కోనాపురం గ్రామంలో 10 ఎకరాల భూమి ఉందని చూపి తల్లికి వందనం కు అనర్హురాలిగా గుర్తించారు. తహసీల్దార్ కార్యాలయం నుండి తన పేరు మీద సెంటు భూమి లేదని పత్రం తెచ్చి సచివాలయంలో అందించాను.
– మీనాక్షి, విద్యార్థిని తల్లి,ఉరవకొండ

తల్లికి వందనం రాకుండా చేశారు



నా పేరు మీద రెండెకరాల భూమికి తోడు ఆన్‌లైన్ మరో 8 ఎకరాలు ఉన్నట్లు చూపి తల్లికి వందనం రాకుండా చేశారు. దీని కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. ఆన్‌లైన్‌లో భూమిని తొలగించే వరకు తల్లికి వందనం రాదేమోనని అనిపిస్తోంది. – ప్రసాద్, రాకెట్ల

గ్రీవెన్స్‌లో పెట్టిన వారికి అవకాశం



ఇన్‌ఎలిజిబుల్ జాబితాలో తెలిపిన అభ్యంతరాలపై విద్యార్థుల తల్లిదండ్రులు సరైన పత్రాలు సమర్పించి ఉంటే రెండో జాబితాలో అర్హులు అవుతారు. ప్రభుత్వం త్వరలోనే రెండో జాబితా విడుదల చేస్తోంది.
– రవిప్రసాద్, ఎంపీడీఓ,ఉరవకొండ

పార్టీని బలోపేతం చేద్దాం



మెట్టు విశ్వనాథరెడ్డిని అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసే దిశగా సమష్టిగా కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు విశ్వనాథరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపి, సన్మానించారు. మెట్టు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తల అభిమానాన్ని ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

నేటి నుంచి బీఎల్‌ఓలకు శిక్షణ

రాయదుర్గంటౌన్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓలు) మంగళవారం నుంచి 16 వరకు జాతీయ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తహీల్దార్ నాగరాజు, ఎన్నికల డీటీ సుజాత తెలిపారు. ఈ మేరకు శిక్షణ షెడ్యూల్‌ను సోమవారం వారు వెల్లడించారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 296 మంది బీఎల్‌ఓలు ఉన్నారని, పట్టణంలోని డ్వామా హాల్‌లో రోజుకు 50 మంది చొప్పున ఈ నెల 8,9,10,11,15,16 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా శిక్షణ ఉంటుందన్నారు.

వక్ఫ్‌భూమి పేదలకు కేటాయించాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని దాసప్ప రోడ్డుకు పక్కన నిరుపయోగంగా ఉన్న వక్ఫ్‌బోర్డు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. రాయదుర్గం వీహెచ్‌పీ అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి మాదుగొండే మల్లికార్జున స్థానిక రెవెన్యూ అధికారులకు సోమవారం విన్నవించారు.

సాయి భక్తుల భిక్షాటన

కూడేరు: మండల కేంద్రంలో షిర్డిసాయిబాబా ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో సాయి భక్తులు సోమవారం భిక్షాటన చేశారు. ఈ నెల 10న షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్‌పర్సన్ భారతి తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బెళుగుప్ప: ఎర్రగుడికి చెందిన హెచ్.తిప్పేస్వామి కణేకల్లు మండలంలోని గోపలాపురం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తిప్పేస్వామి తన సొంత పనిపై కణేకల్లు మండలం గోపులాపురం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా, ద్విచక్రవాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో కాలు విరిగింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి భార్య శ్యామల ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కణేకల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మహానేత వైఎస్సార్ జయంతి

రాయదుర్గం: డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలు రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉవరకొండ నియోజకవర్గాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించేలా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమయత్తమయ్యారు. మహానేత విగ్రహాలను శుభ్రం చేయించి వేడుకలకు సిద్ధం చేశారు. కొన్ని చోట్ల పాలాభిషేకాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్ మన నుంచి దూరమై 16 ఏళ్లు అయినా ఆయన జ్ఞాపకాలు మాత్రం ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని సమన్వయకర్తలు మెట్టు గోవిందరెడ్డి, తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజకీయాల్లో గొప్ప సిద్ధాంతం కలిగిన వ్యక్తి అని వారు కొనియాడారు. ఈ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులంతా పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైఎస్సార్ జయంతికి తరలిరండి..

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

కళ్యాణదుర్గం: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు తలారి చరణ్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సరోజా కాంపౌండ్‌లోని పార్టీ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు హాజరవుతారని తెలిపారు.

నేడు బెళుగుప్పలో వైఎస్సార్ జయంతి

బెళుగుప్ప: డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైభవంగా పాండు రంగస్వామి రథోత్సవం



రాయదుర్గంలో సాగుతున్న రథోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులో స్వకుళిసాళి సమాజ బాంధవుల ఆరాధ్య దైవమైన రుక్మిణీ సమేత పాండురంగస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయంలో ఏకాదశి సందర్భంగా రెండు రోజులపాటు పూజలు చేశారు. రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఉత్సవ మూర్తులను బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్ మీదుగా కోటలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం వరకు లాగారు. అక్కడి నుంచి ఓబుళాచారి రోడ్డు మీదుగా రథోత్సవం ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కేబీ మురళి, హటకేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రెసిడెంట్ సఫారి వెంకటేశులు, ఏపీ స్వకుళసాళి సమాజ ప్రెసిడెంట్ కాంబ్లే నగేష్, తెలంగాణ శాఖ ప్రెసిడెంట్ కాంబ్లె రామలింగేశ్వర, అనంతపురం అంబా భవాని ధర్మకర్త వెంకట సురేష్ బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ట్రెజరీ ఉద్యోగి మృతి

కళ్యాణదుర్గం: కంబదూరు సబ్ ట్రెజరీ కార్యాలయ కాంట్రాక్టు ఉద్యోగి పూజారి (ఎర్ర) నాగరాజు (55) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కళ్యాణదుర్గం సబ్ ట్రెజరీ కార్యాలయంలో పని చేస్తూ ఇటీవల కంబదూరుకు బదిలీపై వెళ్లారు. విద్యార్థి దశ నుంచి ఎస్ఎస్‌యూఐలో ఉంటూ, కాంగ్రెస్ నాయకుడిగా వైఎస్సార్ వీరాభిమానిగా ఉండేవాడని సన్నిహితులు తెలిపారు. కళ్యాణదుర్గంలోని స్వగృహంలో ఆయన మృతదేహానికి సబ్ ట్రెజరీ ఉద్యోగులు, పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్టీసీ దుకాణాలకు టెండర్ల ఆహ్వానం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో పరిధిలోని కళ్యాణదుర్గం, కుందుర్పి, ఆత్మకూరు, కంబదూరు బస్టాండ్ ఆవరణలోని పలు దుకాణాల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ రామచంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం బస్టాండ్‌లో పక్కా స్టాల్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు రూ.1.45 లక్షలు, స్టాల్‌లో బుక్‌స్టాల్ జిరాక్స్ (ఎస్సీ,ఎస్టీ, పీఈబీసీ) లకు రూ.1.12 లక్షలు, ఖాళీ స్థలం ఏటీఎం నిర్వహణకు రూ.80 వేలు, ఖాళీ స్థలం బ్యూటిక్, బ్యూటీపార్లర్, టైలరింగ్, మగ్గం వర్క్స్ దుకాణానికి రూ.18 వేలు, కుందుర్పిలో ఖాళీస్థలంలో టీ స్టాల్ నిర్వహణకు రూ.16 వేలు ధరావత్తు నిర్ణయించినట్లు తెలిపారు. టెండరు దరఖాస్తులు ఈనెల 14 వరకు కళ్యాణదుర్గం డిపో మేనేజర్ కార్యాలయంలో లభిస్తాయన్నారు. రూ.295 చెల్లించి దరఖాస్తులను పొందొచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 15న మధ్యాహ్నం 2 గంటల లోపు అనంతపురం ఆర్ఎం కార్యాలయంలోని బాక్స్‌లో వేయాలన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండరు ఖరారు చేయనున్నట్లు తెలిపారు.

ఖాళీ స్థలంలో వ్యాపార దుకాణాలకోసం..

కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో నందు ఉన్న 2.47 ఎకరాల ఖాళీ స్థలం (గ్యారేజీ పక్కన) 846, 1016, 956,976 sq యార్డ్స్ ఖాళీ స్థలంలో వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. www.apsrtc.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తులు పొందొచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 11న మధ్యాహ్నం 2 గంటల లోపు Executive Director Office, kadapaకు పంపాలని తెలిపారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



ఉదిరిపికొండలో జలధికి తరలివెళ్తున్న పీర్ల దేవుళ్లు



కణేకల్లులో పీర్లదేవుళ్లను ఊరేగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్, లింగదహాళ్, శ్రీధరఘట్ట, దర్గాహొన్నూరు, గోవిందవాడ, కల్‌హోళ, కానాపురం, కురువల్లి, చంద్రగిరి, కొత్తూరు తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు సోమవారం ముగిశాయి. గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. యువకులు, భక్తులు పీర్ల ఎదుట ఉత్సాహంగా చిందులు వేశారు. గ్రామస్తులు అగ్ని గుండం చుట్టూ అలావ్ తొక్కారు. సాయంత్రం వందలాది మంది భక్తుల నడుమ పీర్లను జలధికి తరలించారు.

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండలో పీర్లు సోమవారం జలధికి వెళ్లాయి. వేకువజామున పీర్ల దేవుళ్లు పెద్ద వన్నూరుస్వామి, చిన్న వన్నూరు స్వామితో పాటు ఇతర దేవుళ్లు కూడా అగ్ని గుండ ప్రవేశం చేశారు. సాయంత్రం పీర్లను పీర్ల చావిడి నుంచి జలధికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కూడేరులో పానకాల ఉత్సవం నిర్వహించారు. పానకాన్ని పీర్ల మసీదు వద్దకు తీసుకు వచ్చి గుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పీర్ల దేవుళ్లకు చక్కెర చదివింపులు చేయించారు. ముజువార్ మైనుద్దీన్ పీర్ల దేవుళ్లకు చక్కెర చదివించారు.

కణేకల్లు: కణేకల్లులోని నేసేపేట, అక్బర్‌అలీ వీధి, పెద్దదేవర పీర్లమకాణమ్, ఇబ్రహీం ఖలీల్లు పీర్లమకాన్, పాత స్టేట్ బ్యాంకు, తహసీల్దార్ వీధి, దిగువవీధి తదితర కాలనీల్లో కొలువుదీరిన పీర్లదేవుళ్లను సోమవారం ఊరేగించారు. తారకరామనగర్‌లో పీర్లదేవుళ్ల ఊరేగింపు జరిగింది.

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో సోమవారం పెద్దసరిగెత్తు నిర్వహించారు. బెళుగుప్ప వన్నూరస్వామి పీర్ల చావడి వద్ద పెద్ద సరిగెత్తు నిర్వహించారు. శ్రీరంగాపురం, గుండ్లపల్లి, శీర్పి, ఆవులెన్న, అంకంపల్లి, ఎర్రగుడి, గంగవరం, బూదవర్తి తదితర గ్రామాల్లో జరిగింది. మంగళవారం తెల్లవారుజామున పీర్ల స్వాములు అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం జలధి ఉంటుందని ముజావర్లు తెలిపారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, గలగల, గొల్లపల్లి, బేలోడు, నేత్రపల్లి, గోనబావి, గుమ్మఘట్ట, పూలకుంట, కె.పి.దొడ్డి, 75వీరాపురం తదితర గ్రామాల్లో సరిగెత్తు ఉత్సవాలు జరిగాయి. పీర్లస్వాములకు చక్కెర, బెల్లంతో చదివించారు.

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలోమొహర్రం వేడుకలు వైభవంగా ముగిశాయి. సోమవారం సాయంత్రం పీర్ల ఊరేగింపు, జలధి కార్యక్రమాలు జరిగాయి. కోట ఏరియాలో పీర్ల సవారి (ఊరేగింపు)కు భక్తులు పోటెత్తారు. సాయంత్రం పీర్లను ఊరేగించారు. ఉచ్చుబాయి, చమ్మా పీర్ల మకాన్‌లో వెలసిన పీర్లు, ఆత్మకూరు వీధిలోని నింబూసా పీర్ల మకాన్, లడ్డు పీర్ల మకాన్, గొందిబావి పీర్ల చావిడి (పెద్దమకాన్), కోటల్లోని పీర్లను తీసుకొచ్చి ఊరువాకిలి పీర్ల చావిడి వద్ద పూజలు చేయించారు.

వజ్రకరూరు: మండల పరిధిలోని తట్రకల్లు గ్రామంలో సోమవారం సాయంత్రం పీర్ల ఊరేగింపు వైభవంగా జరిగింది. గ్రామంలోని పీర్ల చావడిలో పెద్దఖాసీమ్, చిన్నఖాసీమ్, మౌలిళి, హుసేన్, హసేన్, ఇమామ్, పెనుకొండ బాబయ్య, బందగి స్వామి, వన్నూరుస్వామి తదితర పీర్లు నిలిపారు. అనంతరం పీర్ల చావడి నుంచి మెయిన్‌రోడ్ మీదుగా పీర్ల ఊరేగించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం నిర్వహించారు.



బెళుగుప్ప: బాలుడి బరువు చక్కెర తూకం ఇస్తున్న దృశ్యం



రాయదుర్గంలోని కోటవీధిలో ఊరేగుతున్న పీర్లు



తట్రకల్లులో భక్తిశ్రద్ధలతో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

రుణం కాజేసేందుకు యానిమేటర్ పన్నాగం

శెట్టూరు: తమ అనుమతి లేకుండా, గ్రూపు సభ్యులకు తెలియకుండా ‘ఉన్నతి’ పథకం రుణం కాజేసేందుకు యానిమేటర్ ప్రయత్నం చేస్తున్నారని, న్యాయం చేయాలని అనుంపల్లి మహిళా సంఘం సభ్యురాలు రాధమ్మ, ఆమె భర్త శామ్యూల్ వేడుకుంటున్న వీడియో సోమవారం బయటపడింది. మండలంలోని అనుంపల్లి గ్రామంలోని విజేత డ్వాక్రా మహిళా సంఘానికి ఉన్నతి పథకం ద్వారా సున్నా వడ్డీతో లోన్ మంజూరయ్యింది. అయితే యానిమేటర్ సంఘ సభ్యులకు తెలీకుండా రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. విధివిధానాలు పాటించకుండా యానిమేటర్‌కు వెలుగు అధికారులు రుణం మంజూరు చేశారు. విజేత సంఘం మినిట్స్ పుస్తకంలో సంఘంలోని 10 మంది సభ్యుల ఫోర్జరీ సంతకాలతో ములకలేడు యూనియన్ బ్యాంక్‌కు వెళ్లారు. సంతకాలపై అనుమానం వచ్చిన బ్యాంక్ మేనేజర్ సంఘ సభ్యులకు 10 మందికి ఫోన్ చేసి, సమాచారం తెలిపారు. దీంతో సభ్యులందరూ తమకు రుణం విషయం తెలియదని చెప్పారు. దీంతో మేనేజర్ లోన్ సొమ్ము రూ. 2.20 లక్షలు వేలు విత్‌డ్రా చేయనివ్వకుండా సభ్యుల ఖాతాలోనే ఉంచారు.

రుణం డబ్బులివ్వాలని ఒత్తిడి..

యానిమేటర్ పలుమార్లు బ్యాంక్ వద్దకు వెళ్లి తమకు రుణం మొత్తం ఇవ్వాలని మేనేజర్‌పై ఒత్తిడి తెచ్చారు.అందుకు సంఘ సభ్యుల తీర్మానం లేనిదే డబ్బు డ్రాచేయబడదని మేనేజర్ తేల్చి చెప్పారు. దీంతో యానిమేటర్ సభ్యులను మభ్యపెట్టి ఫేస్‌యాప్‌లో ఫొటోలు తీస్తానని, మొబైల్‌లో ఫొటోలు తీసి, ఖాళీ పేపర్‌పై సంతకాలు చేయించుకున్నారు. అనుమానం వచ్చిన సభ్యులు నిలదీశారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని విజేత సంఘం సభ్యురాలు రాధమ్మ, ఆమె భర్త శామ్యుయేల్ సోషల్ మీడియా వేదికగా తమకు అన్యాయం జరుగుతోందని, తమ అనుమతి లేకుండా లోన్ తీసుకొని తర్వాత తిరిగి కట్టకపోతే అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.